
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం । 27 । అక్టోబర్ । 2023



సోమశిలలో 30.27 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 30.276 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 138 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.62,950
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రాము)	రూ.5,584
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,854
సవర (8 గ్రాములు)	రూ.46,832

గరిష్ఠం/కనిష్ఠం
37.0 /25.8

వాతావరణం

గాలిలో తేమ 55 శాతంగా గురువారం నమోదైంది. ఎండ తీవ్రత, ఉక్కపోత శుక్రవారం సాధారణంగానే ఉంటాయని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

పలువురు తహసీల్దార్ల బదిలీ

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలోని పలువురు తహసీల్దార్లను బదిలీ చేశారు. గతంలో ఏఎస్‌పేట తహసీల్దార్‌గా పనిచేసిన అన్నదాత వెంకటరమణరావును జలదంకికి, విడవలూరు తహసీల్దార్ హమీద్ సెలవుపై వెళ్లడంతో కొడవలూరు తహసీల్దార్ రమాదేవిని ఇన్‌చార్జిగా నియమించారు. దుత్తలూరు డీటీగా పనిచేస్తున్న నరేష్‌ను వెంకటాచలానికి బదిలీ చేశారు.

1న వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ సమావేశం

నెల్లూరు (లీగల్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ సమావేశాన్ని నగరంలోని అనిల్ గార్డెన్స్‌లో నవంబర్ ఒకటో తేదీ సాయంత్రం 5.30కు నిర్వహించనున్నామని లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జి రోజారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మంత్రి, ఎంపీలు, ఎమ్మెల్యేలు తదితరులు హాజరుకానున్నారని చెప్పారు. న్యాయవాదులు తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఖోఖో పోటీలకు 'కేఎన్నార్' విద్యార్థులు



విద్యార్థులకు అభినందన

నెల్లూరు (టౌన్): జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు కేఎన్నార్ మున్సిపల్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు విజయప్రకాష్ పేర్కొన్నారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను గురువారం అభినందించిన అనంతరం ఆయన మాట్లాడారు. తూర్పుగోదావరి జిల్లాలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానాన్ని సాధించారని వివరించారు.

కొడవలూరులో 'జగనన్నకు చెబుదాం' నేడు

నెల్లూరు(దర్గామిట్ట): ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం మండల స్థాయిలో చేపట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని కొడవలూరులో శుక్రవారం నిర్వహించనున్నామని కలెక్టర్ హరినారాయణన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉదయం పది నుంచి మధ్యాహ్నం 1.30 వరకు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించనున్నామని చెప్పారు. మండల పరిధిలోని గ్రామాల ప్రజలు తమ సమస్యలపై అర్జీలను అందజేయాలని కోరారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు 29న ఎంపికలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఆంధ్రప్రదేశ్ వెటరన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు నెల్లూరు జిల్లా వెటరన్ మాస్టర్ క్రీడాకారులను నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారం ఎంపిక చేయనున్నామని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్ రెడ్డి, బసవయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 30 నుంచి 80 ఏళ్లలోపు గల స్త్రీలు, పురుషులు ఎంపికల్లో పాల్గొనవచ్చని తెలిపారు. 100, 200, 400, 800, 1500 మీటర్ల పరుగు పందేలు, హైజంప్, లాంగ్‌జంప్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, జావెలిన్ త్రో, హ్యామర్ త్రో, ఐదు కిలోమీటర్ల నడక పోటీలను నిర్వహించనున్నామని చెప్పారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ధ్రువీకరణ పత్రాలతో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను తీసుకురావాలని కోరారు. ఎంపికైన క్రీడాకారులు జిల్లాలోని రామాయపట్నంలో డిసెంబర్ 9, 10వ తేదీల్లో నిర్వహించనున్న పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారని వివరించారు.

క్రీడా పోటీల కోలాహలం



ముత్తుకూరు: మండలంలోని కృష్ణపట్నం అదానీ వరల్డ్ స్కూల్లో సీబీఎస్‌ఈ క్లస్టర్ – 7 బాలుర అథ్లెటిక్స్ పోటీలను గురువారం ప్రారంభించారు. తొలుత పోర్టు సీఎస్సార్ హెడ్ రాజేష్ రంజన్ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని 60 పాఠశాలలకు చెందిన 800 మంది విద్యార్థులు టోర్నీలో పాల్గొంటున్నారని ప్రిన్సిపల్ సత్యనారాయణ చెప్పారు. రన్నింగ్ రేస్, జావెలిన్ త్రో, షాట్‌పుట్, హైజంప్, లాంగ్‌జంప్‌లో పోటీలను నిర్వహించనున్నారు.

ఈ - క్రాప్.. ఫుల్ జోష్

ఖరీఫ్‌లో నూరు శాతం బుకింగ్
- రాయితీ విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు తప్పనిసరి
- పంటకు మద్దతు ధర కోసం ప్రక్రియ కీలకం
- ఈ – కేవైసీ చేస్తున్న వ్యవసాయ శాఖ
- ఆర్బీకేల్లో రైతులతో గ్రామసభలు
- అభ్యంతరాలుంటే మార్పులు, చేర్పులు

అర్హులైన రైతులు పథకాలకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఈ – క్రాప్ బుకింగ్‌ను ప్రభుత్వం పకడ్బందీగా నిర్వహిస్తోంది. వాస్తవానికి ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించిన ఈ – క్రాప్ బుకింగ్ ప్రక్రియ ఏటా జరుగుతోంది. గ్రామస్థాయిలో వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు కీలకంగా మారడంతో అక్కడి నుంచే పంటల నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయిస్తున్నారు. దీని కోసం ఆర్బీకేల ఉద్యోగులు క్షేత్రస్థాయిలో పనిచేసి లక్ష్యాలను పూర్తి చేయగలుగుతున్నారు.



జిల్లాలో ఇలా..

- ఈ - క్రాప్ బుకింగ్ విస్తీర్ణం: 1,77,159.06 ఎకరాలు
- జిల్లాలో ఖరీఫ్ సాగు రైతుల సంఖ్య: 50,432
- ఉద్యాన పంటలు: 38 వేల ఎకరాలు
- మొత్తం క్రాప్ బుకింగ్: 1,34,458
- ఈ - కేవైసీ చేయించుకున్న రైతులు: 47,860
- ఈ - కేవైసీ పూర్తయిన పంటల విస్తీర్ణం: 1,29,166 ఎకరాలు

పొదలకూరు: జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన పంటల నమోదును వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు, సిబ్బంది నూరు శాతం పూర్తి చేయగలిగారు. జిల్లాలో ఈ – క్రాప్ బుకింగ్ పూర్తి కావడంతో తప్పులను సరిదిద్దేందుకు గానూ ప్రతి ఆర్బీకేలో గ్రామసభలను ప్రభుత్వం నిర్వహిస్తోంది. రైతులకు వివరించి నమోదులో పొరపాట్లు ఉంటే సరిదిద్దుతున్నారు. ఆర్బీకేల్లో రైతులతో సమావేశాలను ఈ నెల 26 నుంచి 29 వరకు ఏర్పాటు చేస్తున్నారు. సాంకేతిక కారణాలతో రైతులు ఎట్టి పరిస్థితుల్లో నష్టపోకుండా వ్యవసాయశాఖ అధికారులు అన్ని చర్యలు చేపడుతున్నారు.

ఈ – క్రాప్ తప్పనిసరి

రైతులకు ప్రభుత్వం అందజేసే సంక్షేమ పథకాలు, సబ్సిడీలకు ఈ – క్రాప్ బుకింగ్‌ను తప్పనిసరి చేశారు. రైతు భరోసా, పంటల బీమా, పంటకు మద్దతు ధర రైతులకు వర్తించాలంటే దీన్ని విధిగా చేయించుకోవాల్సి ఉంటుంది. వ్యవసాయ, ఉద్యాన శాఖలు సంయుక్తంగా ఆర్బీకేల్లో ఉన్న ఉద్యోగులు, సిబ్బంది ద్వారా లక్ష్యాలను నిర్ణయించి ప్రక్రియను చేయిస్తుంటారు. రైతులు పండించే పంటల వద్దకెళ్లి వాటి వివరాలను ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఫలితంగా ఆయా సీజన్లలో ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు, ఇతర రాయితీలను పొందేందుకు ఈ – క్రాప్ ఎంతో ఉపయోగపడుతోంది. ధాన్యానికి మద్దతు ధర సైతం పంట నమోదు ద్వారానే లభిస్తుండటంతో చాలా మంది రైతులు స్వచ్ఛందంగా బుకింగ్ చేయించుకుంటున్నారు.



మనుబోలు మండలం వెంకన్నపాళెంలో రైతు భరోసా కేంద్రం

కీలకంగా మారిన ఈ – కేవైసీ

ఈ – క్రాప్ బుకింగ్ అనంతరం ఈ – కేవైసీని తప్పక చేయించుకోవాల్సి ఉంటుంది. లేని పక్షంలో పంట నష్టం సంభవించినా, ధాన్యానికి మద్దతు ధర లభించాలన్నా సాంకేతిక సమస్యలు ఏర్పడతాయి. ఇతరుల ద్వారా పంటలను సాగు చేస్తూ దూర ప్రాంతంలో ఉన్నా సకాలంలో ఈ – కేవైసీని చేయించుకోవాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులు సంక్షేమ పథకాలు, రాయితీలను పొందకుండా పకడ్బందీగా నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

తప్పుల సవరణకు అవకాశం

ఈ – క్రాప్ బుకింగ్, ఈ – కేవైసీ నమోదులో తప్పులు దొర్లితే ఆర్బీకేల ద్వారా సవరించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. గ్రామసభల్లో ముందుగా ఈ – క్రాప్ బుకింగ్ చేసిన రైతుల పేర్లను వెల్లడించనున్నారు. బుకింగ్‌లో పేర్లు, విస్తీర్ణం, సర్వే నంబర్లు, పంటల రకాల నమోదులో తప్పులను రైతులు తెలియజేస్తే సవరించనున్నారు.

అన్నదాతలకు ఎంతో మేలు



ఈ – క్రాప్ బుకింగ్‌తో రైతులకు ఎంతో మేలు జరుగుతోంది. రైతులు ఎలాంటి పంటలను సాగు చేస్తున్నారో తెలియడంతో పాటు ప్రభుత్వం అందజేసే పథకాలు తప్పక వర్తిస్తాయి. విత్తనాలు, ఎరువుల కొనుగోలుకూ పంటల నమోదు ఉపయోగపడుతుంది.
– దయాకర్‌రెడ్డి, రైతు, కల్యాణపురం

పూర్తి న్యాయం



పంటలకు పరిహారాన్ని అందజేయాలంటే గతంలో ప్రభుత్వం వద్ద ఎలాంటి సమాచారం ఉండేది కాదు. అనర్హులు పరిహారం పొంది అర్హులు నష్టపోయేవారు. ఇప్పుడెలాంటి సమస్య లేకుండా పూర్తి సాంకేతిక పరిజ్ఞానంతో ఈ – క్రాప్, ఈ – కేవైసీ ద్వారా రైతులకు న్యాయం జరుగుతోంది.
– జయరామిరెడ్డి, రైతు, పొదలకూరు

సద్వినియోగం చేసుకోవాలి



ఆర్బీకేలకు రైతులు వెళ్లి గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి. క్రాప్ బుకింగ్‌లో పేర్లు, పంటల విస్తీర్ణం, ఆధార్ నంబర్ల నమోదులో తప్పులుంటే సరిచేసుకునేందుకు అవకాశం ఉంటుంది. జాబితాలో పేర్లను పరిశీలించి అన్ని సక్రమంగా ఉండేలా బాధ్యత తీసుకోవాలి. చివరి జాబితా అప్‌లోడైతే మార్చేందుకు వీలుండదు.
– శివనాయక్, ఏడీఏ, పొదలకూరు

పక్కాగా ఓటర్ల జాబితా సవరణ



మాట్లాడుతున్న హరినారాయణన్

జిల్లా ఓటర్లు @19,11,638

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	స్త్రీలు	ఇతరులు	ఓటర్లు
కందుకూరు	271	1,09,050	1,10,770	25	2,19,845
కావలి	314	1,19,917	1,25,754	34	2,45,705
ఆత్మకూరు	278	1,07,395	1,09,034	11	2,16,440
కోవూరు	324	1,26,569	1,36,852	19	2,63,440
నెల్లూరు సిటీ	248	1,14,966	1,20,441	77	2,35,484
నెల్లూరు రూరల్	275	1,28,286	1,35,390	33	2,63,709
సర్వేపల్లి	284	1,10,898	1,17,259	30	2,28,187
ఉదయగిరి	323	1,19,171	1,19,641	16	2,38,828
మొత్తం	2317	9,36,252	9,75,141	245	19,11,638

- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): ఓటర్ల జాబితా సవరణ పక్కాగా జరిగేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. సమ్మరీ రివిజన్‌పై ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల బీఎల్వోలు, సూపర్‌వైజర్లు, ఏఈఆర్వోలకు అవగాహన కార్యక్రమాన్ని నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో గురువారం నిర్వహించారు. ఓటర్ల జాబితా తయారీలో జాగ్రత్తలు.. మార్పులు, చేర్పులు.. క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఓటర్ల ముసాయిదా జాబితాను శుక్రవారం ప్రచురించనున్నామని వివరించారు. అప్పటి నుంచి జనవరి ఐదు వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను పరిష్కరించి అర్హులకు ఓటర్ల జాబితాలో స్థానం కల్పించాలని సూచించారు. తప్పుల్లేని ఓటర్ల జాబితాను రూపొందించాలని ఆదేశించారు. ఓటర్ల జాబితా సక్రమంగా ఉంటే ఎన్నికలు 50 శాతం ప్రశాంతంగా జరిగినట్లేనని చెప్పారు. జనాభాకనుగుణంగా స్త్రీ, పురుష ఓటర్ల నిష్పత్తి ఉండేలా చూడాలని సూచించారు. ఎన్నికల విధుల్లో క్రమశిక్షణతో పనిచేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తగు చర్యలు చేపట్టడంతో పాటు ఎన్నికల సంఘానికి నివేదించాల్సి ఉంటుందన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా నవంబర్ 4, 5.. డిసెంబర్ 2, 3న పోలింగ్ కేంద్రాల్లో ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అందుబాటులో ఉండి ఓటర్లను నమోదు చేయాలని చెప్పారు. 80 ఏళ్లు నిండిన వారికి ఇంటి వద్దే ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల సంఘం ఈసారి కల్పించిందని తెలిపారు. డీఆర్వో లవన్న, ఉదయగిరి, ఆత్మకూరు ఈఆర్వోలు ప్రేమ్‌కుమార్, మధులత, తహసీల్దార్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులు ఓటు నమోదు చేసుకోండి

వచ్చే ఏడాది జనవరి ఒకటి నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటును సమీప పోలింగ్ కేంద్రాల్లో డిసెంబర్ తొమ్మిదిలోపు నమోదు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. ఫారం – 6 ద్వారా ఓట్ల చేర్పులు.. 6ఏ ద్వారా విదేశాల్లో నివసిస్తున్న భారత పౌరులను ఓటర్ల జాబితాలో చేర్చొచ్చని వివరించారు. ఎన్నికలకు సంబంధించిన మరింత సమాచారం కోసం 1950కు నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రహదారి భద్రతపై అవగాహన అవసరం

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



రవాణా శాఖ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పక్కన ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: రహదారి భద్రత ఆవశ్యకతను చిన్నతనం నుంచే తెలియజేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. రూరల్ మండలంలోని రుద్రకోట వద్ద జాతీయ రహదారిపై ఐదెకరాల విస్తీర్ణంలో నిర్మించిన కావలి ప్రాంతీయ రవాణా శాఖ నూతన భవనాన్ని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డితో కలిసి మంత్రి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. సంక్షేమ కార్యక్రమాలతో పాటు అభివృద్ధి పనులను రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున చేపడుతోందని వివరించారు. రవాణా సేవలను ఒకే చోట నుంచి అందించే ప్రక్రియలో భాగంగా కావలిలో ప్రాంతీయ రవాణా శాఖ నూతన భవనాన్ని ప్రారంభించడం ఎంతో సంతోషకరమన్నారు. అన్ని రకాల రవాణా సేవలతో మోడల్ కార్యాలయంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని వివరించారు. రవాణా శాఖ ద్వారా అర్హులందరికీ వాహనమిత్ర పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు. జిల్లాలో రవాణా శాఖ సమర్థంగా పనిచేస్తోందని కితాబిచ్చారు. అనంతరం ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. నియోజకవర్గంలోని రెండు మండలాలు నెల్లూరు ఆర్టీఏ పరిధిలో ఉన్నాయని, వీటిని కావలి పరిధిలో చేరిస్తే ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. డీటీసీ చందన, ఆర్టీఓ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో ఆరోగ్యంగా..

- డిశ్చార్జయిన చిన్నారి శ్రావ్య



ఇంటి వద్ద ఆరోగ్యంగా ఉన్న శ్రావ్య

ఉలవపాడు: మండల పరిధిలోని కరేడు పల్లెపాళెనికి చెందిన ఏడాది పాప మాకా శ్రావ్య నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతూ వైద్యం చేయించుకోలేని పరిస్థితుల్లో ఉన్న సమయంలో 'చిన్న పాపకు పెద్దకష్టం' శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి దాతలు విశేషంగా స్పందించారు. ఫోన్‌పే ద్వారా నేరుగా తండ్రి సురేష్‌కు నగదును పంపారు. వైద్యానికి సుమారు రూ.6.50 లక్షల వరకు దాతలు సాయం అందించారు. పిల్లల వైద్య నిపుణుడు సతీష్‌బాబు ప్రధానంగా ఈ ఫండింగ్ బాధ్యతలు తీసుకున్నారు. సాయి స్కూల్ యాజమాన్యం రూ.60 వేలు అందించింది. ప్రకాశం, నెల్లూరు జిల్లాల ఫార్మసిస్టులు దాదాపు రూ.50 వేలు సాయం చేశారు. అంతే కాకుండా దాదాపు 400 మంది దాతలు ఫోన్ పేద్వారా సాయం అందించారు. వీరి సహకారంతో పాప శ్రావ్య గురువారం డిశ్చార్జయింది. వైద్యం కష్టమనుకున్న తరుణంలో తమను ఆదుకున్న సాక్షి పత్రిక, దాతలకు తల్లిదండ్రులు సురేష్, భవాని కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం పాప ఆరోగ్యంగా ఉందని తెలియజేశారు.

జాతీయ స్థాయి పోటీల్లో సత్తా



అఖిలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గుడ్లూరు: జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించి గ్రూప్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో మండలంలోని చేవూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన అఖిల అద్భుత ప్రతిభను కనబర్చి పతకాలను సాధించిందని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, పీఈటీ శివరావమ్మ తెలిపారు. విద్యార్థిని గురువారం అభినందించిన అనంతరం వారు మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్‌లోని భిలాయ్‌లో ఈ నెల 15 నుంచి 19 వరకు నిర్వహించిన జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో అఖిల పాల్గొందన్నారు. ఇందులో ఆంధ్రా జట్టు ద్వితీయ స్థానం సాధించిందన్నారు. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో అఖిల తమిళనాడు విద్యార్థితో కలిసి ప్రథమ స్థానాన్ని సాధించిందని వివరించారు.

అడ్డదారులకు బారులు

- నెల్లూరులోని బార్లలో పబ్ కల్చర్
- డీజే మోతలు.. అమ్మాయిలతో డ్యాన్స్‌లు
- మద్యం మత్తులో మహిళలతో అసభ్యకర ప్రవర్తన
- అర్ధరాత్రి 12 వరకు మద్యం విక్రయాలు
- పట్టించుకోని పోలీస్, ఎక్సైజ్ అధికారులు



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నగరంలోని కొందరు బార్ యాజమానులు న్యూ కల్చర్ పేరుతో అడ్డదారులు తొక్కుతున్నారు. నిబంధనలను తుంగలో తొక్కి బార్‌ను పబ్‌గా మార్చేస్తున్నారు. బార్‌లో మహిళలు వెయిటర్లుగా ఉండకూడదనే నిబంధనను అతిక్రమించి.. మద్యాన్ని వారితో గ్లాసుల్లో పోయిస్తున్నారు. నిత్యం డీజే మోతలు.. చిందులతో వింత పోకడలకు నాంది పలుకుతున్నారు. బార్ ముసుగులో అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహిస్తున్న వారిపై చర్యలు చేపట్టాల్సిన పోలీస్, ఎక్సైజ్ శాఖల అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అడుగడుగునా నిబంధనల ఉల్లంఘన

జిల్లాలో 51 బార్లకు ఎక్సైజ్ శాఖ అనుమతిచ్చింది. నగరంలో 34 బార్లకు అనుమతులున్నాయి. వాస్తవానికి ఉదయం 11 నుంచి రాత్రి 11 వరకే మద్యాన్ని విక్రయించాలి. అయితే నగరంలోని కొందరు బార్ యజమానులు యువతను ఆకట్టుకునేందుకు పబ్ కల్చర్‌ను ప్రవేశపెట్టారు. నగరంలోని మినీబైపాస్ రోడ్డులో ఏర్పాటైన ఓ బార్‌ను పబ్‌గా మార్చారు. అక్కడ నిబంధనలను అడుగడుగునా ఉల్లంఘిస్తున్నారు. సదరు బార్‌లో ఇతర రాష్ట్రాలకు చెందిన యువతులను వెయిటర్లుగా నియమించారు. వీరితో మద్యాన్ని సరఫరా చేయిస్తున్నారు. ఇక్కడ రాత్రి 12 గంటల వరకూ మద్యం విక్రయాలను సాగిస్తుండటం గమనార్హం.

మద్యం మత్తులో గొడవలు

బార్‌లోకి వెళ్లగానే పబ్ తరహాలో హంగులను ఏర్పాటు చేశారు. డీజే మోతలతో దద్దరిల్లుతోంది. యువతులతో అడుగులేస్తూ కొందరు మందుబాబులు చిందులు వేసేలా చేస్తున్నారు. మద్యం మత్తులో నానా హంగామా సృష్టిస్తున్నారు. గతంలో డ్యాన్స్ చేస్తున్న యువతితో మందుబాబులు అసభ్యకరంగా ప్రవర్తించడంతో గొడవ జరిగి పోలీస్‌స్టేషన్‌కు పంచాయితీ చేరింది. అయితే పోలీసులు విషయాన్ని సద్దుమణిగేలా చేసి వ్యవహారాన్ని బయటకు రాకుండా చూశారనే ఆరోపణలున్నాయి. ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నా, యాజమానులకు ఏ మాత్రం పట్టడంలేదు.

నిబంధనలా.. అంటే..?

మినీబైపాస్ పరిధిలో ఏర్పాటు చేసిన బార్‌కు నిబంధనలు వర్తించవు. అటు ఎక్సైజ్ శాఖ అధికారులు కన్నెత్తి చూడరు. దీంతో బార్ యజమానులు ఆడిందే ఆటగా సాగుతోంది. వాస్తవానికి సదరు బార్‌ను ఏర్పాటు చేసిన భవనానికి సైతం సరైన అనుమతుల్లేవు. కమర్షియల్ అనుమతుల్లేకుండానే బార్‌ను ఏర్పాటు చేశారనే ఆరోపణలున్నాయి. మరోవైపు ఈ ప్రాంతంలోని మరో బార్‌లోనూ ఇదే తంతు జరుగుతోందని సమాచారం.

చర్యలు చేపడతాం

బార్‌లో నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవు. బార్‌లో వెయిటర్లుగా మహిళలు ఉండకూడదు. సమయపాలన పాటించాలి. నిబంధనలు పాటించని బార్లను తనిఖీ చేసి చర్యలు చేపడతాం.
– నాగమల్లేశ్వరరెడ్డి, ఈఎస్, నెల్లూరు

పంట నమోదు వివరాలను సరిచూసుకోండి



పంట వివరాల జాబితాను పరిశీలిస్తున్న సుధాకర్‌రాజు

కొడవలూరు: రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాల వద్ద పంట నమోదు వివరాలను ప్రదర్శించామని, జాబితాలోని వివరాలను రైతులు సరిచూసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు కోరారు. మండలంలోని నార్తురాజుపాళెం ఆర్బీకేలో ప్రదర్శించిన పంట వివరాల జాబితాను గురువారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. జాబితాలో ఏమైనా తప్పులు దొర్లి ఉంటే వెంటనే సంబంధిత వీఏఏను సంప్రదించి సరిచేసుకోవాలని సూచించారు. పంట వివరాల నమోదు తుది జాబితాను వచ్చే నెల ఒకటిన ప్రకటించనున్నామని వివరించారు. పంట నమోదు వివరాల ఆధారంగానే పంట బీమా, పంట కొనుగోలు, పంట నష్టం తదితర ప్రయోజనాలను కల్పించనున్న తరుణంలో జాబితాను సరిచూసుకొని తప్పులుంటే సరి చేసుకోవాలని కోరారు. ఏడీఏలు నర్సోజీ, సుజాత, మండల వ్యవసాయాధికారి లక్ష్మి, వీఏఏ శివజ్ఞాన తదితరులు పాల్గొన్నారు.

డీఎల్డీఓలుగా ఉద్యోగోన్నతి

నెల్లూరు (పొగతోట): జిల్లాలోని వివిధ మండలాల్లో పనిచేస్తున్న ఎంపీడీఓలకు డివిజనల్ లెవల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది. డీపీఓ సుస్మితారెడ్డి, బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి, నుడా అకౌంట్స్ ఆఫీసర్ హేమలతకు ఉద్యోగోన్నతులు లభించాయి.

క్లుప్తంగా

రేపు వెంగమాంబ ఆలయ మూసివేత

దుత్తలూరు: పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా నర్రవాడలోని వెంగమాంబ పేరంటాలు అమ్మవారి దేవస్థానాన్ని శనివారం సాయంత్రం 4 నుంచి ఆదివారం ఉదయం 9 గంటల వరకు మూసివేస్తున్నట్లు ఆలయ ఈఓ ఉషశ్రీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం ఆలయ సంప్రోక్షణ, శుద్ధి కార్యక్రమాల అనంతరం 9 గంటల నుంచి అమ్మవారి దర్శనం కల్పించనున్నట్లు చెప్పారు. భక్తులు గమనించాలని కోరారు.

గొర్రెల కాపరిపై గుర్తుతెలియని వ్యక్తుల దాడి

దుత్తలూరు: గొర్రెల కాపరిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడిచేసి గాయపరిచి బైక్‌ను అపహరించుకెళ్లిన ఘటన మండలంలోని బ్రహ్మేశ్వరం సమీపంలోని మధు గార్డెన్స్ వద్ద బుధవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు..దుత్తలూరుకు చెందిన ఉప్పలపాటి సుబ్బారెడ్డి రోజూలాగే ఉదయం గొర్రెలను మేతకు తోలుకెళ్లాడు. సాయంత్రం తిరిగి ఇంటికి గొర్రెలను తోలుకొస్తుండగా ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు మంచినీరు కావాలంటూ వచ్చి ఇనుపచువ్వలతో దాడిచేసి గాయపరిచారు. అనంతరం అతని వద్ద ఉన్న బైక్ తీసుకుని పరారయ్యారు. బాధితుడు తన స్నేహితులకు ఫోన్ చేయగా, 108 వాహనంలో ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దుత్తలూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ బోల్తా



బోల్తా పడిన లారీ

మర్రిపాడు: నందవరం–పొంగూరుకండ్రిక మధ్య న నెల్లూరు–ముంబై జాతీయ రహదారిపై గురువారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. నెల్లూరు నుంచి బద్వేల్ వైపు బొగ్గులోడుతో వెళ్తున్న లారీ పొంగూరు సమీపంలోకి రాగానే డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో రాంగ్ రూట్‌లోకి దూసుకెళ్లి రోడ్డు పక్కన బోల్తా పడింది. ప్రమాద సమయంలో ఎదురుగా ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు.

కల్వర్టును ఢీకొన్న టాటాఏస్

- ముగ్గురికి గాయాలు



నుజ్జునుజ్జయిన టాటాఏస్

మనుబోలు: టాటాఏస్ వాహనం అదుపుతప్పి కల్వర్టును ఢీకొనడంతో ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘటన మనుబోలు–పొదలకూరు రోడ్డులో అక్కంపేట శ్రీరాంనగర్ కాలనీ వద్ద గురువారం వేకువన చోటు చేసుకుంది. వివరాలు..పొదలకూరు నుంచి టాటా ఏస్ వాహనంలో ఐదుగురు మనుబోలు వైపు వస్తున్నారు. శ్రీరాంనగర్ కాలనీ సమీపంలో డ్రైవర్ నిద్ర మత్తులోకి జారుకోవడంతో వాహనం అదుపు తప్పి కల్వర్టును ఢీకొంది. దీంతో అందులో ప్రయాణిస్తున్న మహాలక్ష్మి, సంజయ్, భద్రీనాథ్ గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో చికిత్స నిమిత్తం గూడూరు ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్	: రూ.127
లేయర్	: రూ.110
బ్రాయిలర్ చికెన్	: రూ.222
స్కిన్‌లెస్ చికెన్	: రూ.246
లేయర్ చికెన్	: రూ.187

నిమ్మధరలు (కిలో)



పెద్దవి	: రూ.50
సన్నవి	: రూ.15
పండ్లు	: రూ.5

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎంపీ, వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 31వ డివిజన్‌లోని చవటమిట్ట గిరిజన కాలనీలో రూ.80 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్లు, డ్రెయిన్ల పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ ఆదాల మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటి వరకు 31వ డివిజన్ పరిధిలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. కేవలం ఎనిమిది నెలల కాలంలో రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.150 కోట్లను ప్రభుత్వం కేటాయించిందని వివరించారు. ఇప్పటికే పలు పనులు పూర్తవగా, మిగిలినవి పురోగతిలో ఉన్నాయన్నారు. అభివృద్ధి, సంక్షేమం వైఎస్సార్‌సీపీ లక్ష్యమని, అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలను నేరవేర్చిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న విమర్శల్లో వాస్తవాలు ఏ మాత్రం లేవన్నారు. మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి, రూరల్ నియోజకవర్గం నుంచి తనను వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో రూరల్ నియోజకవర్గంలో నియంతపాలన ఉండేదని, ప్రస్తుతం ఎంతో ప్రశాంతంగా ఉందన్నారు. ఆదాల బాధ్యతలు తీసుకున్న తరువాత ఎనలేని విధంగా అభివృద్ధి, సంక్షేమం జరిగిందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆదాలను ఆదరించాలని కోరారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, రైల్వేబోర్డు మెంబర్ స్వర్ణా వెంకయ్య, మర్రిపాడు జెడ్పీటీసీ మల్లు సుధాకర్ రెడ్డి, నాయకులు ఏసునాయుడు, పాలకీర్తి రవి, షేక్ ఆసీఫ్, డివిజన్ నాయకులు కమల్, నవీన్, ఆదిరెడ్డి, సుబ్బారెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మెట్టప్రాంతంలోని రోడ్లను విస్తరించండి



దత్తాత్రేయకు లేఖను అందజేస్తున్న మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో అతి ముఖ్యమైన రోడ్లను రెండు లేన్లుగా విస్తరించాలని మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ద్వారా కేంద్ర జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి గురువారం లేఖ పంపారు. ప్రధానంగా నందవరం వద్ద 67వ నంబర్ జాతీయ రహదారి నుంచి ప్రారంభమై 565వ నంబర్ జాతీయ రహదారి మీదుగా ఉదయగిరి వరకు 31 కిలోమీటర్ల మేర ఉన్న రోడ్డు రెండు నియోజకవర్గాల ప్రజల వ్యవసాయ, వాణిజ్య, పర్యాటక అవసరాలకు అతికీలకంగా ఉందని లేఖలో పేర్కొన్నారు. నంద్యాల జిల్లాలోని అహోబిలం, కర్నూలు జిల్లాలోని శ్రీశైలం, ప్రకాశం జిల్లాలోని భైరవకోన, నెల్లూరు జిల్లాలోని ఉదయగిరి కోట, తదితర పర్యాటక ప్రాంతాలకు నాలుగు జిల్లాల నుంచి నిత్యం రాకపోకలు సాగించే వేలాది మంది పర్యాటకులకు ఈ రోడ్డు మార్గం అనుకూలంగా ఉందన్నారు. నెల్లూరు, ప్రకాశం, వైఎస్సార్ జిల్లాల్లోని రైతులు పంట ఉత్పత్తులను ఎగుమతి చేసుకునేందుకు అతిముఖ్యమైన నందవరం– ఉదయగిరి రహదారిని రెండు వరుసల రహదారిగా విస్తరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వృద్ధురాలి హత్య, చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకట రమణ

కావలి: వృద్ధురాలిని హత్య చేసి ఇంట్లో చోరీకి పాల్పడిన కేసులో నిందితుడైన దగదర్తి మండలానికి చెందిన యువకుడు తిరుపతి వరప్రసాద్‌ను గురువారం అరెస్ట్ చేసినట్లు కావలి డీఎస్పీ ఎం వెంకటరమణ తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకరులకు నిందితుడి వివరాలను వెల్లడించారు. వివరాలు.. దగదర్తి మండలం అనంతవరం పంచాయతీ పరిధిలోని లయన్స్‌నగర్‌కు చెందిన తిరుపతి వరప్రసాద్ కావలిలో డిగ్రీ చదివి తప్పాడు. అప్పట్నుంచి ప్యాకర్స్ అండ్ మూవర్స్‌లో పనిచేస్తున్నాడు. తన అవసరాలు, ఇబ్బందులు తీర్చుకునేందుకు ఎలాగైనా అడ్డదారిలో నగదు సంపాదించేందుకు దొంగతనం చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇళ్లలోని సామగ్రిని ప్యాకింగ్ చేసే సమయంలో బీరువా తాళాలు ఎక్కడెక్కడ పెడతారో గమనించేవాడు. సామాజిక మాధ్యమాల ద్వారా ఫోరెన్సిక్ వాళ్లకు దొరకకుండా ఎలా దొంగతనాలు చేయాలో అవగాహన తెచ్చుకున్నాడు. ఈ క్రమంలో పట్టణంలోని జనతాపేట నార్త్‌లో ఫస్ట్‌లైన్‌లో నివాసం ఉంటున్న మంచాల మాల్యాద్రితో పరిచయం పెంచుకుని అప్పుడప్పుడు చిన్నచిన్న వస్తువులు తెచ్చి ఇస్తుండేవాడు. ఆ విధంగా మాల్యాద్రి కుటుంబ సభ్యులతో పరిచయం పెంచుకుని వాళ్ల ఇంటిపై అవగాహన ఏర్పరుచుకున్నాడు. ఈ నేపథ్యంలో సుమారు పది రోజుల క్రితం వేకువజామున 5 గంటలకు దొంగతనం చేయాలనే ఉద్దేశంతో మాల్యాద్రి ఇంటికి వెళ్లి డోర్ తట్టాడు. అతని భార్య మంచాల భారతి డోర్ తీయగా సార్ ఉన్నారా అని అడిగాడు. సార్ నిద్రపోతున్నారని ఆమె సమాధానం చెప్పగా ఇంట్లో అందరూ మేల్కొని ఉన్నారని వెనక్కి వచ్చేశాడు. మాల్యాద్రి ఉదయాన్నే వాకింగ్, భారతి ఆదివారం సత్సంగాలకు వెళ్తుంటారు. ఈ విషయాన్ని తెలుసుకుని ఈ నెల 22న ఆదివారం ఉదయం మాల్యాద్రి వాకింగ్, భారతి సత్సంగానికి వెళ్లగా, సుమారు 6 గంటల సమయంలో వరప్రసాద్ వాళ్ల ఇంట్లోకి ప్రవేశించాడు. ఇంట్లో పైన ఉన్న బెడ్‌రూమ్‌లోకి వెళ్లి హ్యాండ్ బ్యాగ్‌లోని తాళాలు తీసుకుని బీరువా తెరచి అందులోని బంగారు నగలను దొంగిలించాడు. యథావిధిగా బీరువా తాళాలు వేసి మళ్లీ వాటిని అదే హ్యాండ్ బ్యాగ్‌లో పెట్టాడు. ఎవరికీ అనుమానం రాకుండా కిందికి దిగి వస్తున్న సమయంలో కింద హాల్లో ఉన్న మాల్యాద్రి అత్త మంచాల రమణమ్మ అనే వృద్ధురాలి చూసి గుర్తుపట్టింది. దీంతో ఆమె అందరికీ చెప్పేస్తుందని భయపడి తన వెంట తెచ్చుకున్న సుత్తితో తలపై బలంగా కొట్టాడు. ఆమె స్పృహ కోల్పోయి దివానాపై పడిపోగా బంగారం తీసుకుని పారిపోయాడు. అనంతరం ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు ఆమెను ఆస్పత్రికి తరలించగా మృతి చెందింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన కావలి టూటౌన్ సీఐ సుధాకర్ తన సిబ్బందితో దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడ్ని గుర్తించి అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడి నుంచి నల్లపూసల దండ, రెండు జతల బంగారు కమ్మలు, సుమారు ఐదు సవర్ల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

ప్రజారక్షణ.. స్ఫూర్తి స్మరణ

- ఆకట్టుకున్న పోలీసు ఓపెన్‌హౌస్



సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నెల్లూరు(క్రైమ్): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నగరంలోని పోలీసు కవాతు మైదానంలో ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. పోలీసు పరికరాల పనితీరు, పోలీసుల విధి నిర్వహణ, తదితర అంశాలను ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డి విద్యార్థులకు వివరించారు. పోలీసులు, ప్రజల నడుమ సత్సంబంధాలు నెలకొల్పేందుకు ఓపెన్‌హౌస్ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు త్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు శ్లాఘనీయమన్నారు.
ప్రతిఒక్కరూ సత్ప్రవర్తనతో నడుచుకుంటూ ఉన్నతశిఖరాలు అధిరోహించి ప్రజలకు సేవచేయాలని విద్యార్థుల్లో ఎస్పీ స్ఫూర్తి నింపారు. కాగా ఓపన్‌హౌస్ కార్యక్రమంలో బుల్లెట్‌ప్రూఫ్ వెహికల్, కమ్యూనికేషన్ వాహనం, 207 వజ్రవాహనం, మెటల్‌డిటెక్టర్, డ్రాగన్‌లైట్, రాకర్, బాంబ్ డిస్పోజబుల్, ఫింగర్‌ప్రింట్ పరికరాలు, కమ్యూనికేషన్ మ్యాన్‌ప్యాక్ సెట్స్, డాగ్‌స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ బృందాలు, సెల్ జామర్, వీహెచ్‌ఎఫ్‌సెట్, ట్రాఫిక్ నియంత్రణ పరికరాలు, రోడ్ సేఫ్టీ వాహనాలు, బాడీవార్న్ కెమెరాలు, దిశ యాప్, దిశ వాహనాలు, డయల్ 100 పనివిధానం, సీపీఆర్, తదితరాలపై విద్యార్థులకు పోలీసు అధికారులు అవగాహన కల్పించారు.

రేపు వాల్మీకి జయంతి సభ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో ఈ నెల 28న మహర్షి వాల్మీకి జయంతిని నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి వెంకటయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహర్షి వాల్మీకి జయంతిని రాష్ట్ర పండగగా నిర్వహించాలని నిర్ణయించిందని చెప్పారు. ఈ మేరకు నిర్వహిస్తున్న వాల్మీకి జయంతి సభలో జిల్లాలోని వాల్మీకి బోయ నాయకులు, పెద్దలు, బీసీ నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

2న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు

నెల్లూరు సిటీ: ఏపీఎస్ఆర్టీసీ ఐటీఐ అప్రెంటీస్‌కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు అక్టోబరు 2న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆర్టీసీ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటాచలం మండలం కాకుటూరు వద్ద ఉన్న ఏపీఎస్ ఆర్టీసీ శిక్షణా కళాశాలలో ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని చెప్పారు. సెప్టెంబరు 8న దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఐటీఐ ఒరిజనల్ సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో హాజరుకావాలని కోరారు.

రేపు జిల్లా అభివృద్ధి సమన్వయ కమిటీ సమావేశం

నెల్లూరు (పొగతోట): జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(డీడీసీఎంసీ) సమీక్ష సమావేశాన్ని ఈ నెల 28న ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ బీ చిరంజీవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగే సమావేశానికి కమిటీ చైర్మన్, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై అధికారులతో సమీక్షిస్తారని, సంబంధిత అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

పొదలకూరు : పట్టణ సమీపంలోని రైసుమిల్లు వద్ద గురువారం వేకువన జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. వివరాలు.. తాటిపర్తి గ్రామానికి చెందిన ఎం భాస్కర్‌రెడ్డి(45) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం వేకువన తాటిపర్తి నుంచి పొదలకూరుకు మోటారుసైకిల్‌పై బయలు దేరాడు. పొదలకూరు సమీపంలోని రైసుమిల్లు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని నెల్లూరులోని నారాయణ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భాస్కర్‌రెడ్డి మృతితో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

స్కానింగ్ సెంటర్లపై నిఘా ఉంచండి



కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో వైద్యారోగ్యశాఖ అధికారులు

నెల్లూరు సిటీ: జిల్లాలోని స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని కలెక్టర్ ఎం హరినారాయణన్ జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులకు సూచించారు. గురువారం జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నూతన స్కానింగ్ సెంటర్లు, రెన్యూవల్ చేసుకున్న సెంటర్లను తనిఖీ చేయాలని సూచించారు. లింగ నిర్ధారణకు పాల్పడుతున్న స్కానింగ్ కేంద్రాలను గుర్తించాలన్నారు. పోలీసుల సహకారంతో డికాయ్ ఆపరేషన్లు నిర్వహించి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డి, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, ఎన్‌జీఓ కవితారెడ్డి, పీఎన్‌డీటీ కమిటీ సభ్యులు బీ శ్రీనివాసరావు, కనకరత్నం పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై యువకుల దాడి

కావలి: ఆర్టీసీ బస్సుకు అడ్డంగా ఉన్న కారును పక్కకు తొలగించమని హారన్ కొట్టిన డ్రైవర్‌పై అందులోని యువకులు ఆగ్రహంతో దాడికి పాల్పడిన ఘటన గురువారం రాత్రి కావలిలో చోటు చేసుకుంది. కావలి రూరల్ ఎస్సై వివరాల మేరకు..విజయవాడలోని ఆటోనగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నెల్లూరు నుంచి విజయవాడకు వెళ్తున్న క్రమంలో కావలిలోని ట్రంక్‌రోడ్డులో కారు అడ్డు రావడంతో బస్సు డ్రైవర్ రాంసింగ్ హారన్ కొట్టారు. దీంతో కారులోని యువకులు డ్రైవర్‌ను దుర్భాషలాడారు. అయినా డ్రైవర్ పట్టించుకోకుండా బస్సును ముందుకు కదలించారు. అనంతరం మద్దూరుపాడు వద్దకు బస్సు చేరుకోగానే దుర్భాషలాడిన యువకులతో పాటు మరికొందరు బస్సును ఆపి డ్రైవర్‌పై దాడికి పాల్పడ్డారు. ఈ దృశ్యాన్ని తన సెల్‌ఫోన్‌లో వీడియో రికార్డు చేస్తున్న బస్సులోని ప్రయాణికుడు రాజుపైన దౌర్జన్యానికి పాల్పడి సెల్‌ఫోన్‌ను పగులకొట్టారు. దీంతో బస్సులోని ప్రయాణికులు భీతిల్లిపోయారు. గాయాలపాలైన బస్సు డ్రైవర్ కావలి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కావలి రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి మందలించిందని బాలిక ఆత్మహత్య

ఉలవపాడు: తల్లి మందలించడంతో మనస్తాపం చెందిన ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఉలవపాడులో చోటుచేసుకుంది. వివరాలు.. ఉలవపాడుకు చెందిన చిరుతోటి కిషోర్ రెండో కుమార్తె కుమార్తె నిఖిలశ్రీ(14) స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. దసరా సెలవుల్లో ఎక్కువగా బయట ఇళ్ల వద్ద ఉంటున్నావని నిఖిలశ్రీని తల్లి మందలించింది. దీంతో మనస్తాపం చెందిన బాలిక ఈ నెల 24న తండ్రి మింగే టాబ్లెట్లను ఒక్కసారిగా పది మింగింది. దీంతో అస్వస్థతకు గురవగా ఒంగోలులోని రిమ్స్‌కు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై కత్తితో దాడి



ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న అప్రపున్నీసా

అనమసముద్రంపేట: మహిళపై కత్తితో దాడి చేసి గాయపరిచిన ఘటన ఏఎస్‌పేటలో గురువారం ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితుల వివరాల మేరకు..ఏఎస్‌పేటలోని దర్గా సమీపంలో షేక్ అప్రపున్నీసా, ఫయాజ్ దంపతులు 50 ఏళ్లుగా నివాసం ఉంటున్నారు. వారి ఇంటి పక్కనే జాహీద్ కుటుంబం నివాసం ఉంటుంది. గత కొద్ది నెలలుగా ఇంటి నిర్మాణానికి సంబంధించి రెండు కుటుంబాల నడుమ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి జావీద్, రాహిద్, జీనత్ కలసి ఫయాజ్ ఇంట్లోకి ప్రవేశించారు. ఫయాజ్‌పై కత్తితో దాడిచేయ బోతుండగా అప్రపున్నీసా అడ్డుకున్నారు. దీంతో ఆమెను కాళ్లతో తన్ని కత్తితో చేతిపై గాయపరిచారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అప్రఫ్‌వున్నీసాను ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలించారు. కాగా దాడి చేసి గాయపరిచిన వారిపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోగా బాధిత మహిళ కుటుంబంపైనే కేసు నమోదు చేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. కొద్ది రోజుల క్రితమే ఫయాజ్ దంపతులు తమపై దాడి జరుగుతుందని ఏఎస్సై నజీర్ దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఏఎస్‌పేట పోలీసుల పనితీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాగా ఈ విషయమై ఏఎస్సై నజీర్‌ను సంప్రదించగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు